ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024

ఒక హత్య.. ఎన్నెన్నో శిక్షలు





కందుకూరు శివారెడ్డి కేసులో అరుదైన తీర్పు

ఊరంతా సంబరం జరిగే సమయంలో చిన్నపాటి వివాదం. సర్దుకుని పోయుంటే సరిపోయేది. కానీ గొడవ పడ్డారు. దాడులకు దిగారు. ఈ క్రమంలో ఒకరి పంచె ఊడిపోయింది. లో దుస్తులు లేకపోవడంతో అవమానంగా భావించారు. ఇరువర్గాలవారు కేసులు పెట్టుకున్నారు. ఆ తరువాత రాజీ అయ్యారు. అక్కడితో ఆగిపోయినా బాగుండేది. కానీ 'వస్త్రాపహరణం' అన్నట్లుగా కక్ష పెంచుకుని.. కొన్ని నెలల తరువాత హత్య చేశారు. 2017లో మొదలైన చిన్నపాటి గొడవ.. 2018లో హత్య జరిగేదాకా వెళ్లింది. ఆ కేసులో తీర్పు సోమవారం వెలువడింది. ఒకే ఇంట్లో ఐదుగురికి, మరో ఇద్దరికి రెండు జీవితకాలపు శిక్షలు పడ్డాయి. ఇప్పుడు ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటి..? లేనిపోని గొడవలకుపోతే ఎంతటి నష్టం జరుగుతుందో తెలిపే ఘటన ఇది. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డి హత్య కేసులో జిల్లా సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పు జిల్లాలో కలకలం రేపుతోంది.

- ఏడుగురికి రెండు జీవిత ఖైదులు.. జరిమానాలు
- పీర్ల పండుగ రోజున చిన్న వివాదంతో గొడవలు
- జైలుపాలైన ఐదుగురు అన్నదమ్ములు, మరో ఇద్దరు

ఇవీ శిక్షలు

శివారెడ్డి హత్య కేసులో ముద్దాయిలకు వివిధ సెక్షన్ల కింద కోర్టు పలు రకాల శిక్షలు విధించింది. ఇందులో కఠిన కారాగార శిక్షలు, జీవితకాలపు సాధారణ శిక్షలు, జరిమానాలు ఉన్నాయి. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయని కోర్టు పేర్కొంది.



కుటుంబసభ్యుల రోదన

- ఏడుగురు ముద్దాయిలకు మారణాయుధాలు ఉపయోగించినందుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా
- హత్య, హత్యకు కుట్ర పన్నినందుకు ఏడుగురు ముద్దాయిలకు జీవితకాలపు సాధారణ శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా.
- హత్యాయత్నం నేరం రుజువు కావడంతో ఏ5, ఏ6 ముద్దాయిలకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా.
- హత్య కేసులో ఏ1, ఏ8 ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా.
- హత్యకేసులో ఏ3, ఏ4, ఏ5, ఏ6, ఏ9 ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా.

మరిన్ని వివరాలు 7లో



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

● కుటుంబాలకు శిక్ష

ఇంటి పెద్దను కోల్పోయి శివారెడ్డి కుటుంబం శిక్షను అనుభవిస్తోంది. హత్య చేసి జైలుపాలైన సాకే బాలకృష్ణ, అతని సోదరులు, ఇతర ముద్దాయిల కుటుంబాలు కూడా శిక్షలు అనుభవిస్తున్నాయి. కోర్టు ఆవరణలో మహిళలు, బంధుమిత్రులు కన్నీటిసంద్రంలో మునిగి కనిపించారు. ఇంతటి విషాదాలకు క్షణికావేశం ఒక కారణం కాగా, నేరం చేస్తే జరగపోయే అనర్థాల గురించి ఆలోచించకపోవడం మరో కారణం. జైలు జీవితం ఎంత దారుణంగా ఉంటుందో.. వారు దూరమై.. ఇంటివద్ద ఉంటున్న మహిళలు, ఇతర కుటుంబ సభ్యుల పరిస్థితి అంతే దారుణంగా ఉంటుంది. కోర్టు విధించిన శిక్షను ముద్దాయిలు మాత్రమే అనుభవించరు. కుటుంబాలు అనుభవిస్తాయి. శివారెడ్డి హత్య కేసు అరుదైనదని, అయినా చట్టం ప్రకారం ముద్దాలు చేసిన నేరాలకు ఉన్న అతి తక్కువ శిక్ష విధిస్తున్నామని కోర్టు పేర్కొనడం గమనార్హం.



ముద్దాయిలను తరలిస్తున్న పోలీసు వ్యాన్ వద్ద ఏడుస్తున్న కుటుంబ సభ్యులు

ఒరిగి పడిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం







ప్రమాద స్థలం.. మృతులు హనుమంతరెడ్డి, రంగమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, సెప్టెంబరు 23: కూతుళ్లతో రెండు రోజుల పాటు ఆనందంగా గడిపి.. సొంతూరుకు పయనమైన తల్లిదండ్రులను ప్రమాదం బలితీసుకుంది. ఎంత జాగ్రత్తగా ప్రయాణం చేస్తున్నా.. పక్కన వెళుతున్న వాహనం అదుపుతప్పి మీదపడింది. ఏం జరుగుతోందో వారికి తెలిసే అవకాశం కూడా లేకుండా.. క్షణాల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అనంతపురం నగర శివారులో సోమవారం జరిగిన ఘోర ప్రమాదంలో గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి(68), రంగమ్మ(65) దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరి కుమారుడు నాగేశ్వర్‌రెడ్డి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురు కూతుళ్లను అనంతపురం రూరల్ మండలం ప్రసన్నాయనపల్లికి ఇచ్చి వివాహం జరిపించారు. కూతుళ్ల వద్ద రెండు రోజుల పాటు ఉండి సోమవారం ఉదయం తమ స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఇదే సమయంలో కక్కలపల్లి టమోటా మార్కెట్ నుంచి ముంబయికి బయలుదేరిన ఐచర్ వాహనం శిల్పారామం సమీపంలో బోల్తా పడింది. స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా వేగంగా వెళుతూ అదుపు తప్పి.. పక్కనే హనుమంతరెడ్డి దంపతులు వెళ్తున్న బైక్‌పై పడింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. హనుమంతరెడ్డి తల ఎగిరిపడటం, రంగమ్మకు శరీరం ఛిద్రం కావడంతో ప్రమాద స్థలం భయానకంగా మారింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

గుంతకల్లు, సెప్టెంబరు 23: విడపనకల్లు మండల పరిధిలో నాలుగో తరగతి బాలికపై తొమ్మిదో తరగతి బాలుడు అత్యాచారయత్నం చేశాడు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు ఉరవకొండ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న పాఠశాలకు సెలవు కావటంతో బాలిక ఆడుకునేందుకు వెళ్లింది. అదే సమయంలో 9వ తరగతి విద్యార్థి ఆడుకుందామని మభ్యపెట్టి బాలికను ఓ పాత ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ముళ్ల పొదల్లో బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక తప్పించుకుని కేకలు వేసుకుంటూ పరుగున ఇంటికి వెళ్లి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. బాలిక కుటుంబ సభ్యులు బాలుడికి దేహశుద్ధి చేశారు. అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాలిక తల్లిదండ్రులు వెళ్తుండగా గ్రామ పెద్దలు, కాలనీ వాసులు వారించారు. ఇద్దరూ మైనర్లేనని, పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని బాలిక కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. కానీ తమ కుమారుడిపై బాలిక తల్లిదండ్రులు అకారణంగా దాడి చేశారని బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు సోమవారం ఉరవకొండ సర్కిల్ కార్యాలయంలో అత్యాచారయత్నం గురించి ఫిర్యాదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు చేస్తామని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23: జిల్లాకు స్పిక్ కంపెనీకి చెందిన 1312 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయ్యాయని ఏడీఏ రవి తెలిపారు. ఇందులో డీఏపీ 701 మెట్రిక్ టన్నులు, యూరియా 361, 20-20-0-13 రకం ఎరువులు 250 మెట్రిక్ టన్నులు ఉన్నాయని తెలిపారు.

ముగ్గురికి ఎఫీషియెన్సీ అవార్డులు

గుంతకల్లు, సెప్టెంబరు 23: రైల్వే డివిజన్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ద మంత్ ఎఫీషియెన్సీ అవార్డులను ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో తొమ్మిది మంది ఉద్యోగులకు ఈ అవార్డులను జీఎం అరుణ్ కుమార్ జైన్ ప్రకటించారు. అందులో గుంతకల్లు డివిజన్‌కు మూడు, విజయవాడ డివిజన్‌కు మూడు, సికింద్రాబాద్ డివిజన్‌కు రెండు, హైదరాబాద్ డివిజన్‌కు ఒక అవార్డు లభించాయి. గుంతకల్లు డివిజన్‌లోని గూడ్సు లోకో పైలెట్లుగా పనిచేస్తున్న శంకర్ చౌదరి (యర్రగుంట్ల), బి.బిత్యనారాయణ (గుంతకల్లు), అభయ కుమార్ (రాయచూరు) మ్యాన్ అఫ్ ద మంత్ అవార్డులకు ఎంపికయ్యారు.

బీమా అక్రమాలు నిజమే..!

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23: విడపనకల్లు మండలం డొనేకల్లులో 2021 ఖరీఫ్‌లో పంటల బీమా వర్తింపు కోసం భారీ వర్షాలకు దెబ్బతిన్న రైతుల జాబితాలో అనర్హుల పేర్లను చేర్చినట్లు వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించారు. అనర్హులకు రూ.10.39 లక్షలు బీమా సొమ్ము జమైనట్లు గుర్తించారు. ఈ అక్రమాలపై వైసీపీ నాయకుడు రాంబాబు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఇదివరకు పలుమార్లు వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించారు. అనర్హులకు పంటల బీమా వర్తింపజేసినట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో అప్పటి జేడీఏ చంద్రానాయక్, ఉరవకొండ ఏడీఏ పద్మజ, విడపనకల్లు ఏఓ మధుమతి, డొనేకల్లు వీఏఏ విజయ భాస్కర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. వీరికి వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారి సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారు.

పంట పండింది

● ఆదుకున్న ప్రత్యామ్నాయ పంటలు ● మంచి దిగుబడి ఇచ్చిన సజ్జ, కొర్ర ● ధర బాగుండటంతో రైతుల ఆనందం



సజ్జ కంకులను మిషన్ ఆడిస్తున్న కూలీలు



ఆరబోసిన కంకులు

గుత్తి రూరల్, సెప్టెంబరు 23: దిగుబడితో పాటు ధర కూడా బాగుండటంతో ఈ ఏడాది సజ్జ పంట సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేరుశనగను సాగు చేసి నష్టపోయిన రైతులు సజ్జ పంట వైపు మొగ్గుచూపారు. గడిచిన పదేళ్ల నుంచి పత్తి, వేరుశనగ, ఆముదం పంటలను సాగుచేస్తూ రైతులు నష్టాల చవిచూశారు. తెగుళ్ల సోకడం, వర్షాభావం వల్ల దిగుబడులు రానేలేదు. దీంతో రైతులు ఈ ఏడాది సంప్రదాయ పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన సజ్జ, కొర్ర, జొన్న పంటలను సాగు చేశారు. జక్కలచెరువు, తొండపాడు, ఊబిచెర్ల, గొందిపల్లి, ఇసురాళ్లపల్లి, వన్నేదొడ్డి, అనగానిదొడ్డి, ఊటకల్లు, బేతాపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారు.



కొర్ర పంట

ఎకరాకు నాలుగు కిలోలు

మార్కెట్‌కు హైబ్రీడ్ సజ్జ, కొర్ర విత్తనాలు రావడంతో రైతులు వాటి పట్ల మొగ్గుచూపారు. ఎకరానికి 4 కేజీల విత్తనాలు విత్తారు. వేసిన 15 రోజుల నుంచి 20 రోజులకు గడ్డి తొలగించేందుకు సేద్యం చేశామన్నారు. తక్కువ నీటి అవసరం, బెట్టను తట్టుకునే స్వభావం ఉండటంతోపాటు 60 రోజుల్లోనే దిగుబడి వస్తుండటంతో పలువురు రైతులు సజ్జ పంటను సాగు చేస్తున్నారు. కొందరు రైతులు కందిలో అంతర పంటగా సాగు చేశారు. రైతులు ఆశించినట్లుగానే పంట దిగుబడులు వచ్చాయి. ఎకరాకు ఏడు నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావడంతో తమ కష్టం ఫలించిందని పలువురి రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మార్కెట్‌లో క్వింటా రూ.2200 నుంచి 2500 వరకు ఉండటం రైతులకు కలిసి వస్తోంది. కొర్ర పంట కూడా ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ముందుగా వర్షాలు రావడంతో జూన్ చివర, జూలై మొదటి వారంలో విత్తనం విత్తారు. ముందుగా సాగైన పంటలకు 60 రోజులు పూర్తి కావడంతో రైతులు పొలాల్లో పంటలను తొలగిస్తున్నారు. కంకులను వేరు చేస్తున్నారు. ఇతర పంటలతో పోల్చితే సజ్జ, కొర్ర పంటలకు విత్తనాలు, కూలీలు, రసాయన మందులు ఖర్చు తక్కువని రైతులు చెబుతున్నారు.



సజ్జ పంట

సజ్జ పంట ఆదుకుంది



సజ్జ పంటను ఏడు ఎకరాల్లో సాగు చేశా. తొలుత కంది వేసి వాటిలో అంతర పంటగా సజ్జ వేశా. రెండు నెలలకు సజ్జ కాపు చేతికి అందింది. ప్రస్తుతం కంకులను కోస్తున్నాము. వాటిని మెషీన్‌కి వేయాలి. మరో మూడు ఎకరాలో వేరుశనగ పంట సాగు చేశా.

- రైతు నాగార్జున, తొండపాడు

పంట కోతకు వచ్చింది



నేను మూడు ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశా. ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది సజ్జ పంట బాగా పండింది. త్వరలో కంకులను వేరుచేసి పంటను తొలగిస్తాను. కొంత మంది రైతులు పంటను తొలగించారు.

- నాగేంద్ర, ఊటకల్లు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎంపీ అంబికా, ఎమ్మెల్యే బండారు శ్రావణి

గార్లదిన్నె, సెప్టెంబరు 23: రైతుల సంక్షేమమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. ఎంపీఆర్ (మిడ్‌పెన్నార్) డ్యాం నుంచి దక్షిణ కాలువకు సాగునీటిని సోమవారం విడుదల చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి హాజరై గంగపూజ చేసి దక్షిణ కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దసరా పండుగ కంటే ముందే సాగునీరు విడుదల చేసి ఆయకట్టు రైతుల కళ్లల్లో ఆనందం చూశామన్నారు. రైతుల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పని సరిగా 130 రోజులు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని, ధైర్యంగా పంటలు సాగుచేసుకోవచ్చని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీరు విడుదల చేసిన పాపాన పోలేదన్నారు. ఎంపీఆర్ డ్యాం గేట్లు పాడైపోయి నీరంతా వృథాగా పోతున్న స్పందించలేదని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌శివుడు యాదవ్, టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, గుర్రం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ కాలువకు విడుదలైన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ఇది పాట కానే కాదు..!

లచ్చ.. లచ్చన్నర.. రెండు లచ్చలు..



జడ్పీ సాధారణ బదిలీల్లో బేరసారాలు

22న ఉత్తర్వులు ఇవ్వాలి.. ఇంకా ఇవ్వలేదు

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: జడ్పీ ఉద్యోగుల బదిలీలకు బహిరంగ వేలంపాటలు జరుగుతున్నాయి. 'లచ్చ.. లచ్చన్నర... అంతకు మించి..' అని పోటీ పడుతున్నారు. హాట్ సీటు కోసం భారీగా బేరాలకు దిగుతున్నారు. సాధారణ బదిలీలను అడ్డు పెట్టుకుని కొందరు అధికారులు, ఉద్యోగులు ఇలా పోటీ పెట్టి దండుకుంటున్నారు. జడ్పీలో ఏవో, సీనియర్ అసిస్టెంట్ సీట్లను అమ్మకానికి పెట్టారు. 22వ తేదీనే (కటాఫ్ డేట్) బదిలీల ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉన్నా.. 23వ తేదీ ఉదయం నుంచి అదిగో.. ఇదిగో అంటూ ఉత్తర్వులు ఇవ్వకుండా కథ నడిపారు. రాత్రి వరకూ పలువురు ఉద్యోగులు జడ్పీకి వస్తూనే ఉన్నారు. ఆఖరికి 24న ఇస్తారని చెప్పడంతో వెనుతిరిగారు.

అంతా గోప్యత..

జడ్పీలో బదిలీలపై ఆది నుంచి గోప్యత పాటిస్తున్నారు. కొందరు అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. సమాచారం బయటకు పొక్కకుండా వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల చివరి వారానికి బదిలీల కోసం ఉద్యోగుల నుంచి 446 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 286 మంది ఉన్నారు. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 15 మంది, సీనియర్ అసిస్టెంట్లు 25 మంది, జూనియర్ అసిస్టెంట్లు 43 మంది, టైపిస్టులు 18 మంది, డ్రైవర్లు ఇద్దరు, రికార్డు అసిస్టెంట్లు 70 మంది, ల్యాబ్ అసిస్టెంట్లు 20 మంది, లైబ్రరీ అసిస్టెంట్ ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ 89 మంది, నైట్ వాట్‌మెన్ ముగ్గురు ఉన్నారు. రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్స్ కోసం 215 మంది ఉద్యోగులు, సిబ్బంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులతోపాటు ఉద్యోగుల సీనియారిటీ జాబితా, ఉత్తర్వులపైన కూడా గోప్యత పాటిస్తూ వచ్చారు.

భారీగా బేరసారాలు

జిల్లా పరిషత్ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగుతున్న బదిలీల్లో భారీగానే బేరసారాలు సాగుతున్నట్లు తెలిసింది. జడ్పీ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్ సీట్లకు డిమాండ్ ఎక్కువ కావడంతో.. చాలా మందిని జిల్లా కేంద్రం నుంచి దూరంగా పారేసినట్లు తెలిసింది. అయినవారి కోసం ఇక్కడ పనిచేస్తున్న వారిని సాగనంపి, క్యాష్ కొట్టిన వారికి హాట్ సీట్లు అప్పజెప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పాలనాపరమైన బదిలీలు అంటూ.. అడ్డగోలుగా ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని ఆరోపణలు వస్తున్నాయి. బదిలీలకు లక్ష నుంచి రెండు లక్షలు, అంతకుమించి అన్నట్లుగా డబ్బులు వసూలు చేశారని సమాచారం. ఒకరిద్దరు ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు ఈ తతంగాన్ని నడిపినట్లు తెలిసింది.

రాత్రి వరకూ పడిగాపులు..

జడ్పీ సీఈఓలు, డిప్యూటీ సీఈఓల బదిలీల ఈనెల 22వ తేదీనే ఉత్తర్వులు వచ్చాయి. ఆ లోపు సాధారణ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేసి, ఉద్యోగులకు, సిబ్బందికి బదిలీల ఉత్తర్వులు జారీ చెయ్యాలి. కానీ 23వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్యోగులను కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారు. రాత్రి కూడా ఉద్యోగులు జడ్పీ వద్ద పడిగాపులు కాశారు. కానీ 24వ తేదీ బదిలీ ఉత్తర్వులు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. ఉద్యోగుల సాధారణ బదిలీల వెనుక భారీగానే అక్రమాలు జరిగాయని విమర్శలు వస్తున్నాయి. కలెక్టర్ దృష్టి సారిస్తే అక్రమాలు బయట పడే అవకాశం ఉంది. బదిలీల్లో ఉత్తర్వుల జాప్యం, ఉద్యోగుల ఎదురుచూపులు, ఇతర అంశాలపై వివరణ కోసం జడ్పీ సీఈఓకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు.



జడ్పీ వద్ద రాత్రి పడిగాపులు కాస్తున్న ఉద్యోగులు, అధికారులు

ఆర్‌అండ్‌బీలో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లాలోని రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) పరిధిలో పనిచేస్తున్న పలువురు ఈఈలు, డీఈఈలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమేరకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తర్వులు జారీ చేసింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జె. ప్రసాద్‌రెడ్డి	ఈఈ (అనంతపురం)	కళ్యాణదుర్గం
వి. రాజగోపాల్	ఈఈ(కళ్యాణదుర్గం)	అనంతపురం
	డీఈఈల బదిలీలు	
బి. నాగరాజు	పెనుకొండ	ఎన్‌హెచ్ కడప
వి. గిడ్డయ్య	(ఏటీపీ, ఎన్‌హెచ్)	ఎన్‌హెచ్ వి.కోట
రామచంద్రారెడ్డి	(తాడిపత్రి ఎన్‌హెచ్)	ఎన్‌హెచ్ ఈఈ, ఏటీపీ
ఎం. శైలజ	కదిరి	తిరుపతి రూరల్
జె. జగదీష్‌గుప్తా	ఎన్‌హెచ్ వి. కోట.	మడకశిర
ఎం. వెంకట్రామిరెడ్డి	ఈఈ ఎన్‌హెచ్ ఏటీపీ	పెనుకొండ
పి. ధనలక్ష్మి	ఈఈ. పీఏ కడప	ఎన్‌హెచ్ తాడిపత్రి
ఎన్. కంబగిరి	మదనపల్లె	కదిరి

హౌసింగ్‌లో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 23: జిల్లా గృహ నిర్మాణశాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా హౌసింగ్ పీడీగా శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న కె. వెంకటనారాయణను నియమించా రు. దీంతో ఇప్పటి వరకు ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న శైలజ తన పాత స్థానమైన అనంతపురం ఈఈగా కొనసాగనున్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి. కృష్ణారావు	అనంతపురం అర్బన్	ధర్మవరం అర్బన్
బి. శివకుమార్‌నాయక్	శ్రీ సత్యసాయి	మడకశిర
పి. శ్రీమన్నారాయణ	శింగనమల	రాప్తాడు
వై. లక్ష్మీనారాయణమ్మ	తాడిపత్రి	అనంతపురంపీడీ ఆఫీస్
ఎండీ ఖాశీం(మేనేజర్)	అనంతపురం	అనంతపురం రిటైన్

పీఆర్‌లో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న 11మంది డీఈఈలు, 44మంది జేఈఈ(ఏఈ,ఏఈఈ)లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. డీఈఈల బదిలీలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి. శ్రీనివాసమూర్తి	పీఆర్‌ఐ-2 అనంతపురం	పీఐయూ, పుట్టపర్తి
టి. రాజేంద్రప్రసాద్	ఎస్‌ఈ పీఏ (ఏటీపీ)	తాడిపత్రి, పీఆర్‌ఐ
మహమ్మద్ రసూల్	పీఐయూ, అనంతపురం	పీఆర్‌ఐ, ఉరవకొండ
బి. రాజన్న	కళ్యాణదుర్గం, పీఆర్‌ఐ	పీఐయూ, మడకశిర
భరత్‌ప్రకాష్‌రెడ్డి	క్యూసీ-1, అనంతపురం	ఈఈ పీఏ పీఐయూ
డి. రామ్మోహన్‌రెడ్డి	పీఆర్‌ఐ, రాయదుర్గం	క్యూసీ, కడప
జె. మల్లికార్జున	పీఐయూ, మడకశిర	పీఆర్‌ఐ, హిందూపురం
లోకన్న	పీఆర్‌ఐ, ధర్మవరం	క్యూసీ-1, ఏటీపీ
రవీంద్రకుమార్	ఈఈ పీఏ, పీఐయూ	క్యూసీ-2,ఏటీపీ
రాజేశ్వరరెడ్డి	క్యూసీ-1, అనంతపురం	పీఐయూ, తాడిపత్రి
బి. చంద్రకుమార్	పీఐయూ, పెనుకొండ	ఎస్‌ఈ, పీఏ,(ఏటీపీ)

31 మంది ఈఓఆర్డీల బదిలీ

అనంతపురం న్యూటౌన్: ఉమ్మడి జిల్లాలో 31 మంది ఈఓఆర్డీలను బదిలీ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జిలాని బాషా	తాడిపత్రి	పుట్లూరు
కమలాబాయ్	పెద్దపప్పూరు	రామగిరి
ఆనంద్‌ప్రసాద్	పుట్లూరు	రాప్తాడు
గూడెన్న	కణేకల్లు	కంబదూరు
హరికృష్ణ బాలాజీ	కళ్యాణదుర్గం	కుందుర్పి
విజయ్‌శేఖర్‌నాయుడు	యల్లనూరు	తాడిమర్రి
వెంకటలక్ష్మమ్మ	గార్లదిన్నె	శింగనమల
శివన్న	లేపాక్షి	గోరంట్ల
నట్రాజ్	హిందూపురం	కొత్తచెరువు
శకుంతల	తలుపుల	నల్లచెరువు
రాధాకృష్ణ	రామగిరి	కూడేరు
అశోక్‌కుమార్‌రెడ్డి	పుట్టపర్తి	బుక్కపట్నం
దివాకర్	బత్తలపల్లి	ముదిగుబ్బ
కేశవరెడ్డి	రొద్దం	ఓడీ చెరువు
చంద్రమౌళి	ఉరవకొండ	కణేకల్లు
సదాశివ	వజ్రకరూరు	బీకే సముద్రం
వెంకటేష్	యాడికి	తాడిపత్రి
వెంకటనాయుడు	బ్రహ్మసముద్రం	అనంతపురం రూరల్
సురేష్‌బాబు	గుమ్మఘట్ట	పెద్దపప్పూరు
మురళీకృష్ణ	శింగనమల	రాయదుర్గం
నరసింహారెడ్డి	రాప్తాడు	పెద్దవడుగూరు
రంగనాయకులు	రాయదుర్గం	కళ్యాణదుర్గం
నాగభూషణం	డి.హీరేహాళ్	గుంతకల్లు
క్రిష్ణప్ప	రొళ్ల	బత్తలపల్లి
రాజశేఖర్	ఓడీ చెరువు	తనకల్లు
ఇంద్రబాల	బుక్కపట్నం	పుట్టపర్తి
రాజేంద్రకృష్ణకుమార్	ముదిగుబ్బ	పామిడి
లక్ష్మీనరసమ్మ	కూడేరు	సోమందేపల్లి
మాధవి	అనంతపురం రూరల్	బ్రహ్మసముద్రం
కమ్మక్క	తాడిమర్రి	ఆత్మకూరు
శశికళ	పామిడి	యల్లనూరు

25 మంది గ్రేడ్-1 సెక్రటరీల బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23: జిల్లాలో 25 మంది గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులను, 76 మంది గ్రేడ్-3 కార్యదర్శులు, 243 గ్రేడ్-4 కార్యదర్శులను బదిలీ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1 కార్యదర్శుల వివరాలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
భాస్కర్	అమరాపురం	కోడూరు
మహేశ్వరరెడ్డి	తాటిచెర్ల	కల్లూరు
ప్రేమ్‌కుమార్	ఉప్పరపల్లి	రాప్తాడు
ముత్యాలరెడ్డి	అనంతపురం రూరల్	బత్తలపల్లి
అశోక్‌బాబు	నారాయణపురం	ఆకుతోటపల్లి
మహమ్మద్‌రఫీ	ఆకుతోటపల్లి	రాచానపల్లి
సాదిక్‌వలి	బీకేఎస్	చీకదిరేకొండ
వెంకటేశ్వరప్రసాద్	బుక్కపట్నం	కొనకొండ్ల
శ్యామల	సీకేపల్లి	నార్పల
నారాయణస్వామి	కోడూరు	సీకే పల్లి
రవిచంద్ర	గార్లదిన్నె	తాటిచెర్ల
శ్రీనివాసరెడ్డి	కల్లూరు	సోమందేపల్లి
ప్రవీణ్‌బాబు	కదిరికొండ	ఏ. నారాయణపురం
గోపాల్	కొత్తచెరువు	పామిడి
అశ్వత్థమనాయుడు	నార్పల	యాడికి
సుధాకర్	కొండకమర్ల	అమరాపురం
చంద్రశేఖర్	పామిడి	గార్లదిన్నె
నారాయణ	కొడిగెనహళ్లి	పరిగి
సాదిక్‌వలి	పరిగి	బుక్కపట్నం
పెద్ద శ్రీనివాసులు	రాప్తాడు	బీకేఎస్
అబ్దుల్ మునాఫ్	తలుపుల	కాశసముద్రం
శ్రీధర్‌రావు	వజ్రకరూరు	అనంతపురం రూరల్
బాబాఫక్రుద్దీన్	పోలికి	ఉప్పరపల్లి
ఎర్రిస్వామి	యాడికి	పోలికి
బాబురావు	గోరంట్ల	రొళ్ల

ఒక హత్య.. రెండు జీవితకాలాల శిక్ష..!

దెయ్యం శివారెడ్డి హత్యకేసులో అరుదైన తీర్పు

ఏడుగురికి కఠిన శిక్షలు విధించిన సెషన్స్ కోర్టు

శిక్షపడినవారిలో ఐదుగురు అన్నదమ్ములు

ఇద్దరు మైనర్లపై జువైనల్ కోర్టులో కేసు పెండింగ్



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 23: హత్య కేసు ముద్దాయిలు ఏడుగురికి జిల్లా సెషన్స్ కోర్టు రెండు జీవితకాల శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.30 వేల జరిమానా విధించింది. ఈ మేరకు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. శిక్ష పడిన వారిలో ఐదుగురు అన్నదమ్ములు. వీరందరి పైనా రౌడీషీట్ ఉంది. ముద్దాయిలలో సాకే బాలకృష్ణ, సాకే రమేష్‌పై నాలుగు హత్య కేసులు, నాలుగు అత్యాచారం కేసులు, బాంబుల కేసులు ఉన్నాయి. మరో ముద్దాయి సాకే అశోక్ పోక్సో కేసులో నిందితుడు. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డిని వీరు ఏడుగురు హత్య చేసినట్లు నేరం రుజువైంది.

ఇలా మొదలైంది...

కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డి వ్యవసాయం చేసేవాడు. దీంతో పాటు గ్రామంలో శ్రీమోక్షన్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నడిపేవాడు. వైసీపీ తరపున గతంలో వార్డు మెంబరుగా గెలిచాడు. 2017 అక్టోబరు 10న కందుకూరులో పీర్ల పండుగ జరిగింది. గ్రామానికి చెందిన బోయ సాకే బాలకృష్ణ, అతని కుటుంబ సభ్యులు అలాయ్ తొక్కుతున్నారు. అదే సమయంలో శివారెడ్డి నీటి సరఫరా నిమిత్తం ట్యాంకరును ఆటోను తీసుకుని బయలుదేరాడు. బాలకృష్ణ, అతని తమ్ముళ్లు దారి ఇవ్వకుండా శివారెడ్డిని అడ్డుకుని గొడవకు దిగారు. ఆ గొడవలో శివారెడ్డికి, అతని తమ్ముడు నరసింహారెడ్డికి, బాలకృష్ణకు గాయాలయ్యాయి. గొడవ సమయంలో బాలకృష్ణ పంచ ఊడిపోయింది. డ్రాయర్ లేని కారణంగా గ్రామంలో అవమానం జరిగినట్లు ఫీలయ్యాడు. అనంతరం ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. కొంతకాలం తరువాత రాజీపడి, లోక్ అదాలత్‌లో కేసులు కొట్టి వేయించుకున్నారు. బాలకృష్ణ గ్రామంలో పీర్ల పండుగ రోజు పంచె ఊడిపోయిన కారణంగా తనకు జరిగిన అవామానాన్ని మనసులో పెట్టుకున్నాడు. కక్ష పెంచుకుని శివారెడ్డిని చంపుతానని ప్రచారం చేశాడు.

పొలం నుంచి వస్తుండగా..

2018 మార్చి 30వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో శివారెడ్డి, అతని కుమారుడు భాను ప్రకాష్‌రెడ్డి పొలంలో గడ్డి కోసుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరారు. భాను ప్రకాష్‌రెడ్డి బైక్ నడుపుతుండగా, శివారెడ్డి వెనుక కూర్చుని మధ్యలో గడ్డి మోపు వేసుకున్నాడు. దారిలో అంకె భీముడు పొలం వద్ద బోయ సాకే బాలకృష్ణ, అతని చిన్న తమ్ముడు (మైనర్) బైక్‌పై ఎదురుగా వచ్చి అడ్డుకున్నారు. భాను ప్రకాష్‌రెడ్డి ఆపకుండా ముందుకు వెళ్లాడు. బాలకృష్ణ తమ్ముళ్లు రమేష్, అశోక్, సూర్యనారాయణ మరో బైక్‌పై వచ్చి భాను ప్రకాష్‌రెడ్డి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టారు. దీంతో భానుప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి కింద పడ్డారు. బాలకృష్ణ, అతని చిన్న తమ్ముడు, సూర్యనారాయణ వేటకొడవళ్లతో శివారెడ్డిని విచక్షణారహితంగా నరికారు. తన తండ్రిని చంపొద్దని భానుప్రకాష్‌రెడ్డి వేడుకున్నాడు. దీంతో అతన్ని కూడా చంపేందుకు బాలకృష్ణ తమ్ముళ్లు బోయ సాకే భాస్కర్, సాకే విజయ్, బాలకృష్ణ కొడుకు (మైనర్) ప్రయత్నించారు. భాను ప్రకాష్‌రెడ్డి అరుపులు విని పక్కపొలంలో ఉన్న భానుప్రకాష్ రెడ్డి చిన్నాన్న నరసింహారెడ్డి, నాగిరెడ్డి, సతీష్‌రెడ్డి అక్కడికి వచ్చారు. దీంతో వారిని కూడా చంపుతామని బెదిరిస్తూ.. వేటకొడవళ్లతో మూడు బైక్‌లలో పారిపోయారు. ఈ ఘటనపై భానుప్రకాష్‌రెడ్డి ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొత్తం 12 మందిపై చార్జిషీటు దాఖలు చేశారు. వీరిలో ఇద్దరు బాలలు కావడంతో వారిపై జువైనల్ కోర్టులో కేసు నడుస్తోంది. మిగిలిన పది మంది బోయ సాకే బాలకృష్ణ, బోయ సాకే రమేష్, బోయ సాకే అశోక్, బోయ సాకే భాస్కర్, బోయ సాకే విజయ్‌కుమార్, తలారి సూర్యనారాయణ, తలుపూరి మహేంద్ర, బోయ సాకే ఓబుశమ్మ, బుక్కే ప్రభాకర్‌నాయక్, బొగ్గు ప్రసాద్‌పై సెషన్స్ కోర్టులో విచారించారు. బోయ సాకే రమేష్, బోయ సాకే అశోక్, బోయ సాకే భాస్కర్, బోయ సాకే విజయ్‌కుమార్, తలారి సూర్యనారాయణ, తలుపురి మహేంద్రపై నేరం రుజువైంది. వీరికి కోర్టు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన ముగ్గురిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు. అప్పటి డీఎస్పీ వెంకట్రావ్, సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, కోర్టు మానిటరింగ్ సిస్టం హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు రామ్మోహన్, చంద్రమౌళి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు సాక్షులను కోర్టుకు తీసుకురావడంలో గట్టిగా కృషి చేశారు. ఎస్పీ జగదీష్ వారిని అభినందించారు.



కోర్టు ఆవరణలో విషణ్ణ వదనంలో కుటుంబ సభ్యులు



పోలీసు వ్యాన్‌లో జైలుకు తరలుతున్నవారి చేతులు పట్టుకుని ఏడుస్తున్న కుటుంబ సభ్యులు



కోర్టు ఆవరణలో కుటుంబ సభ్యుల రోదనలు





సొమ్మసిల్లిన మహిళలు

కోర్టు ఆవరణలో రోదనలు

తీర్పు వెలువడిన అనంతరం కోర్టు ఆవవరణలో ముద్దాయిల కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. శిక్ష పడిన వారిలో ఐదుగురు అన్నదమ్ములు కావడంతో ఆ కుటుంబ సభ్యులందరూ కోర్టుకు హాజరయ్యారు. ముద్దాయిలను పోలీసులు బస్సులో జైలుకు తరలిస్తుండగా వారి చేతులను పట్టుకుని కన్నీరు మున్నీరయ్యారు. కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. కుటుంబసభ్యుల ఆవేదన చూసి ముద్దాయిలు కంటతడిపెట్టారు. ఏమీ కాదని కొందరు కన్నీరు తుడిచి ధైర్యం చెప్పారు.

రైలు దొంగల ముఠా అరెస్ట్

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 23: రైలులో దోపిడీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను హిందూపురం జీఆర్పీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 2 ల్యాప్‌టాప్‌లు, 4 మొబైల్ ఫోన్లు, 50 గ్రాముల బంగారు, 895 నిద్ర మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ అశోక్‌కుమార్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రైళ్లలో నేరాలు, దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయని, వాటిపై దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో హిందూపురంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. దీంతో వారు రైలు దొంగలుగా గుర్తించామన్నారు. వారు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారని, ఇళ్లకు పీఓపీ పనులు చేసే రాంకరణ్, మనోజ్, హాకీవుల్లాగా గుర్తించామన్నారు. వీరు రైలు ప్రయాణికులను మాటల్లో ఉంచి, పెళ్లి కుదిరిందని, బిడ్డ పుట్టాడని సంతోషకర విషయం అని చెప్పి కూల్ డ్రింక్స్‌లో ముందుగా మత్తు మాత్రలు కలిపిన శీతల పానీయాలను అందిస్తున్నారన్నారు. అది తాగిన 20 నిమిషాల్లో ప్రయాణికులు పూర్తిగా మత్తులో నిద్రపోతారని, వారి వద్ద ఉన్న విలువైన నగలు, నగదు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ఇతర వస్తువులను దొంగలించి పక్క స్టేషన్లలో దిగిపోతున్నారని అన్నారు. వీరు బెంగళూరు బనశంకరిలో అద్దె గది చేసుకొని ఉన్నారన్నారు. ఇలా దొంగలించిన సొమ్మును లూధియానాలోని మనోజ్‌సింగ్‌కు అప్పజెప్పి లబ్ధి పొందుతున్నారన్నారు. త్వరలో మనోజ్‌ను కూడా అరెస్ట్ చేస్తామన్నారు. ఇప్పటికే అనంతపురం, హిందూపురం, బెంగళూరు, విజయవాడ రైల్వేస్టేషన్లలో నమోదైన కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కొత్త వారు ఎవరైనా తినుబండారాలు, ఇతర వస్తువులు ఇస్తే తీసుకోరాదన్నారు. అనుమానితులుగా ఎవరైనా కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. వీరిని పట్టుకునేందుకు సహకరించిన ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐలు బాలాజీనాయక్, నాగరాజు, ఏఎస్‌ఐలు శీనప్ప, సాయినాథ్‌రెడ్డి, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రిజర్వాయర్‌లో 1.653 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, సెప్టెంబరు 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.653 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 912 క్యూసెక్కులు వస్తుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 878 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు వెల్లడించారు.

అటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ల బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లాలో పలువురు సెక్షన్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జిల్లా అటవీశాఖాధికారి వినీత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రేంజ్ సెక్షన్ ఆఫీసర్‌గా పెనుకొండ రేంజ్‌లోని హిందూపురం సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న అక్బర్‌ను నియమించారు. పుట్లూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను ఆత్మకూరుకు బదిలీ చేశారు. కదిరి సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న రామచంద్రారెడ్డిని కదిరి రేంజ్‌లోని కుర్లికి బదిలీ చేశారు. బుక్కపట్నం రేంజ్‌లో బుక్కపట్నం సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న చంద్రానాయక్‌ను పుట్టపర్తి సెక్షన్‌కు బదిలీ చేశారు.

పలువురు బీట్ ఆఫీసర్లకు స్థానచలనం

కదిరి రేంజ్‌లోని పెద్దన్నవారి పల్లి బీట్ ఆఫీసర్‌ను చారుపల్లి బీట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. తుమ్మల బీట్ ఆఫీసర్ హరిప్రసాద్‌ను తనకల్లు కు, కొక్కంటి బీట్ ఆఫీసర్ భాస్కర్‌ను తుమ్మల నార్త్‌కు, కళ్యాణదుర్గం రేంజ్‌లోని ఓబులాపురం బీట్ ఆఫీసర్ రాజును పిల్లలపల్లికి బదిలీ చేశారు. పిల్లలపల్లి బీట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంను ధర్మపురికి, తుమ్మల నార్త్ బీట్ ఆఫీసర్ నారాయణను అనంతపురం రేంజ్‌లోని శింగవరం బీట్‌కు బదిలీ చేశారు. పెనుకొండ రేంజ్‌లోని సోమందేపల్లి బీట్ ఆఫీసర్ శిరీషను కొండపల్లి బీట్‌కు, మడకశిర బీట్ ఆఫీసర్ శ్రీనివాసులును పెద్దన్నవారిపల్లి బీట్‌కు, శింగవరం బీట్ ఆఫీసర్ వెంకటేశులును తుమ్మల సౌత్‌బీట్‌కు, చారుపల్లి బీట్ ఆఫీసర్ ప్రదీప్‌తేజను నల్లమాడ బీట్‌కు, కుర్లి బీట్ ఆఫీసర్ అనీల్‌కుమార్‌ను కొక్కంటి బీట్‌కు, ఎర్రకొండ బీట్ ఆఫీసర్ సుధాకర్‌బాబును సోమందేపల్లి బీట్‌కు, పెనుకొండ బీట్ ఆఫీసర్ మంజులవాణిని గుత్తి రేంజ్‌లోని యల్లనూరు బీట్‌కు బదిలీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్ బదిలీ

జిల్లా అటవీశాఖ కార్యాలయంలో పదేళ్లకుపైగా పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సీసీఎఫ్ నాగేశ్వరరావు ఎట్టకేలకు బదిలీ చేశారు. తిరుపతి సీసీఎఫ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

పరిశ్రమల శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్: జిల్లా పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజారావును అనకాపల్లికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న జిల్లా మేనేజర్ శ్రీధర్‌ను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మునినాథుడును చిత్తూరుకు బదిలీ చేశారు. కర్నూలు సూపరింటెండెంట్ రామాంజనమ్మను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఐపీఓలుగా పనిచేస్తున్న దుర్గేష్‌ను పుట్టపర్తికి, సుజనను నంద్యాలకు బదిలీ చేశారు. కడపలో పనిచేస్తున్న ఐపీఓలు నిషాంత్, భువనేశ్వరిలను జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాలలో పనిచేస్తున్న ఐపీఓ రవీంద్రనాథ్‌రెడ్డిని జిల్లాకు బదిలీ చేశారు.

ఏఈఈలు..

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఏఈఈ, జూనియర్ ఇంజనీర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 18మంది ఏఈఈలు, 20మంది జూనియర్ ఇంజనీర్లను బదిలీ చేశారు.

గనుల శాఖ డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23: జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీగా వెంకటేశ్వర్లు నియమితుడయ్యారు. అమరావతిలోని ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడికి బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న నాగయ్యను నరసరావుపేటకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఏజీ రామకృష్ణ ప్రసాద్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తాడిపత్రిలో పనిచేస్తున్న ఆదినారాయణను నియమించారు. రాజమండ్రిలో పనిచేస్తున్న ఏజీ కృష్ణమూర్తిని ఇక్కడ మైన్స్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషాను శ్రీసత్యసాయి జిల్లాకు, ఆర్‌ఐ కవితను తాడిపత్రికి బదిలీ చేయగా ఆమె స్థానంలో మదనపల్లి నుంచి సుప్రజను ఇక్కడికి బదిలీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తంను శ్రీసత్యసాయి జిల్లాకు, అమరావతిలో పనిచేస్తున్న జ్ఞానేశ్వరిని ఇక్కడికి బదిలీ చేశారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కర్నూలుకు బదిలీ

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్‌రెడ్డిని కర్నూలుకు బదిలీ చేశారు. కర్నూలులో ఈఈగా పనిచేస్తున్న మునిప్రసాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ఐసీడీఎస్‌లో పోస్టుల భర్తీకి శ్రీకారం

నోటిఫికేషన్ విడుదల

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల భర్తీపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 84 అంగన్వాడీ టీచర్, మినీ అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో 8, శింగనమల 6, నార్పల 9, అనంతపురం రూరల్‌లో 10, తాడిపత్రి 14, గుత్తిలో 5, ఉరవకొండ 12, కణేకల్లు 5, కంబదూరు 7, రాయదుర్గంలో 2 పోస్టులు ఖాళీలున్నాయన్నారు. ఈనెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, అక్టోబరు 1వ తేదీ ఆఖరి గడువని ఆమె స్పష్టం చేశారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ, బీపీఈడీ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు సోమవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో డిగ్రీ బీఏ, బీబీఏ, బీసీఏ, బీకామ్, బీఎస్సీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను నిర్వహించామన్నారు. 6831 మంది పరీక్షలు రాయగా 3746మంది పాస్ అయ్యారని తెలిపారు. దీంతో ఉత్తీర్ణత శాతం 54.83గా నమోదైనట్లు పేర్కొన్నారు. జూలైలో నిర్వహించిన బీపీఈడీ ప్రథమ సెమిస్టర్‌లో 53, తృతీయ సెమిస్టర్‌లో 22మంది విద్యార్థులు పాస్ అయ్యారని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం జ్ఞానభూమి పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం అక్టోబరు 10లోపు ఒక్కో పేపర్‌కు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినార్ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్, సూపరింటెండెంట్ మారుతీ, సీనియర్ అసిస్టెంట్ సాయిశివ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: ఐసీడీఎస్ పరిధిలోని బాల సదనంలో ఖాళీగా ఉన్న ఏడు ఉద్యోగాలను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం కింద భర్తీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టోర్ కీపర్ పోస్టు ఒకటి, హౌస్ కీపర్ పోస్టు ఒకటి, రెండు ఎడ్యుకేటర్ (టీచర్) పోస్టులు, రెండు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్ పోస్టులు, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. స్టోర్ కీపర్ పోస్టుకు ఎంపికైన వారికి రూ. 18,356 రెమ్యునరేషన్, హౌస్ కీపర్‌కు రూ. 7,944,, ఎడ్యుకేటర్ పోస్టుకు రూ.5000, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్‌కు రూ.5000, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్‌కు రూ.10 వేలు రెమ్యునరేషన్ అందజేస్తారన్నారు. దరఖాస్తులు, జీతం, అర్హతలు, ఇతర వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ http:// ananthapuramu.gov.inలో పొందుపర్చామన్నారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని పీడీ తెలిపారు.

8 నుంచి డిగ్రీ ఇయర్‌వైజ్ పరీక్షలు

అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23: ఎస్కేయూ ఆధ్వర్యంలో 1994 నుంచి 2014వరకు డిగ్రీ ప్రవేశాలు పొంది ఫెయిలైన విద్యార్థులకు అక్టోబరు 8 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2014 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించేవారన్నారు. తర్వాత ఆరు నెలలకు ఒకసారి సెమిస్టర్ పద్ధతి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వివిధ కారణాల రీత్యా సంవత్సరం వారి పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి మెగా సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 4వేలమందికిపైగా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు ఫీజులు చెల్లించారని తెలిపారు. వారందరికీ అక్టోబరు 8నుంచి 30వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీకామ్ విద్యార్థులకు ఎస్కేయూలో, బీఏ విద్యార్థులకు ఆర్ట్స్ కళాశాలలో, బీఎస్సీ విద్యార్థులకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను www.skuniversity.ac.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08554-255817, 9573761298 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

నవోదయ పరీక్ష గడువు పొడిగింపు

లేపాక్షి, సెప్టెంబరు 23: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులన్నారు. పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 2,250 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.24 పలికినట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల, సెప్టెంబరు23: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు మంగళవారం నుంచి అభ్యర్థుల నుంచి స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ ఉమాశంకరమ్మ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలలాల్లో ఖాళీ పోస్టులు క్యాటగిరీల వారీగా ఇలా ఉన్నాయి. శింగనమల-2 (బీసీ-డి), గోవిందరాయనిపేట(జరనల్), కల్లూరు-3 (ఎస్సీ), కల్లూరు-4(బీసీ-డి), రాఘవేంద్ర కాలనీ(జనరల్), గాంధీ నగర్(బీసీ-సి) ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న స్థానిక మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు కులధ్రువీకరణ పత్రంతో పాటు ఇతర సర్టిఫికెట్లతో మంగళవారం నుంచి అక్టోబరు1 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అమె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ శాఖ కమర్షియల్ విభాగం
డీఈఈగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

అనంతపురంరూరల్, సెప్టెంబరు23: విద్యుత్‌శాఖ కమర్షియల్ సెక్షన్ డీఈఈగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ కమర్షియల్ విభాగానికి కేటాయించడంతో బాధ్యతలు చేపట్టారు.

డీపీఓ కార్యాలయం ఏఓగా నాగరాజు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు23: అనంతపురం డీపీఓ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ధర్మవరం నుండి నాగరాజును బదిలీ చేశారు. అనంతపురం ఏఓగా ఉన్న విశ్వనాథరెడ్డిని కడప డీఎల్‌పీఓ కార్యాలయం ఏఓగా బదిలీ చేశారు. పెనుకొండ ఏఓ గా ఉన్న వంశీని ధర్మవరం ఏఓగా బదిలీ చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిగా ప్రతాప్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23 : జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిగా ప్రతాప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా ఇక్కడ పచేస్తున్న ఆనంద్ రాజ్‌కుమార్ కర్నూలుకు బదిలీ కావడంతో, నంద్యాలనుంచి ప్రతాప్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం : స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా మహబూబ్‌బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఆ పోస్టుకు తాజా బదిలీల్లో మహబూబ్‌బాషాను నియమించారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీడీఓగా దివాకర్

అనంతపురంరూరల్, సెప్టెంబరు23: స్థానిక ఎంపీడీఓగా దివాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జడ్పీసీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నార్పల ఎంపీడీఓగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పుల్లయ్య కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఈఓఆర్డీగా కె వెంకటనాయుడు నియమితులయ్యారు. ఆయన బ్రహ్మసముద్రం మండలంలో పనిచేస్తూ ఇక్కడకు వస్తున్నారు.

'2023 వాతావరణ బీమా ప్రకటించాలి'

రాప్తాడు, సెప్టెంబరు 23: పంటల వాతావరణ బీమా2023వ సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అలాగే జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులను నీటితో నింపాలన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ. 20 వేలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ఎన్‌డీఏ ధ్యేయం

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్‌డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొంది అశోక్ కుమార్ పేర్కొన్నారు. నగరంలో నిర్వహించిన సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న అశోక్‌కుమార్ సంక్షోభంలోనూ సంక్షేమాభివృద్ధికి రెక్కలు తొడిగిన ప్రధానిగా నరేంద్రమోదీ, సీఎంగా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. వందరోజుల పాలనలో అనేక సంక్షోభాలను ఎదుర్కొని, ఎన్నికల హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ సాగించిన అరాచకాలను ప్రజలు నిలువరించినా జగన్‌కు బుద్ధిరావడంలేదని మండిపడ్డారు.

పామిడి ఎంఈఓపై విచారణ చేయండి

- డీఈఓకు టీచర్లు, సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: పామిడి ఎంఈఓ-1 జయానాయక్ ఉపాధ్యాయులను వేధిస్తున్నారని, ఆయనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, సంఘాల నేతలు డీఈఓను కోరారు. సుమారు 100 మంది ఉపాధ్యాయులు, సంఘాల నేతలు సోమవారం రాత్రి మాట్లాడుతూ...ఎంఈఓ -1 జయా నాయక్ ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. ఆయన వివిధ రకాల వ్యక్తిగత, సామూహిక సమస్యలను సృష్టిస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులను ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాడని, మహిళా టీచర్లను సైతం మానసిక వేదనకు గురయ్యేలా వేధిస్తున్నాడన్నారు. పలు విధాలుగా ఉపాధ్యాయులను వేధిస్తున్న ఎంఈఓపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, యూటీఎఫ్ అధ్యక్షులు లింగమయ్య,ప్రధానకార్యదర్శి గోవిందరాజులు, ఇతర నాయకులు లింగమూర్తి, జార్జ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



హోటల్‌లో అగ్నికి ఆహుతైన ఫర్నిచర్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు23: స్థానిక రుద్రంపేటలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో టీ హోటల్, సెలూన్ షాపు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లు అయిందని స్థానికులు తెలిపారు. హైఓల్టేజ్‌తో షార్ట్‌సర్క్యూట్ కావడం ద్వారానే అగ్నిప్రమాదం చోటు చేసుకుందని జిల్లా సహాయ అగ్నిమాపక శాఖాధికారి లింగమయ్య తెలిపారు. ఇందులో ప్రకాష్‌రెడ్డికి చెందిన టీ హోటల్, కుళ్లాయప్పకు చెందిన సెలూన్ షాపు కాలిపోయాయన్నారు. రెండు కలిపి రూ.4 లక్షల వరకు ఆస్థి నష్టం ఉంటుందన్నారు.

చైన్ స్నాచింగ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 23: రూరల్ మండల పరిధిలో సోమవారం ఓ వృద్ధురాలి మెడలో నుంచి దుండగుడు బంగారు గొలుసు లాక్కెళ్లాడు. అయితే ఆమె గట్టిగా పట్టుకోవడంతో అది తెగి పోయి కొంత దొంగ చేతిలోకి వెళ్లగా, ...మరి కొంత ఆ వృద్ధురాలి చేతిలో మిగిలినట్లు అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు. వివేకానందనగర్‌కు చెందిన నాగరత్నమ్మ సోమవారం తన ఇంటి ఎదుట చెత్త ఊడ్చుతుండగా ఓ దొంగ వచ్చి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆమె గట్టిగా పట్టుకోవడంతో ఎనిమిది గ్రాముల గొలుసు ఆమె చేతిలో ఉండిపోగా... 12గ్రాముల బంగారం దొంగ చేతికి చిక్కింది. దాంతోనే అతడు సమీపంలో అప్పటికే బైక్‌లో సిద్ధంగా ఉన్న మరో దొంగతో కలిసి పరారయ్యాడు. బాధితురాలు అనంతపురరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రజల భూముల రక్షణకే ల్యాండ్ టైటిలింగ్ రద్దు

- 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పరిటాల సునీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, సెప్టెంబరు 23: ప్రజల భూములు రక్షణ కోసమే అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం మండలంలో పర్యటించారు. రాప్తాడు పంచాయతీ రామినేపల్లిలో రూ. 10 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మైనార్టీ కాలనీలో రూ. 43 లక్షలతో సీసీ రోడ్లు, రూ. 17 లక్షలతో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయ్‌నగర్‌లో రూ. 50లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మైనార్టీ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... జగన్ మళ్లీ సీఎం అయి ఉంటే ప్రజలు భూములు మాయమయ్యేవన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 25 కోట్ల మంజూరు చేయించామన్నారు. గ్రామాల్లో రోడ్ల పనులు ప్రారంభించామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. త్వరలోనే సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు.

రహదారి సమస్య పరిష్కారం

ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన రాప్తాడు నుంచి చిన్మయ్‌నగర్‌కు వెళ్లే పండమేరు వంక దారి కోతకు గురైంది. సమస్యను స్థానికులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తన ఆదేశాలతో సర్పంచ్ సాకే తిరుపాలు పంచాయతీ నిధులతో చేపట్టిన తాత్కాలిక రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, తహసీల్దార్ విజయకుమారి, టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసు లు, సర్పంచులు సాకే తిరుపాలు, శశికళ, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, సాకే జయరాముడు, గోనిపట్ల శీనా, మరూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, నిర్లక్ష్యాన్ని సహించం: ఎమ్మెల్యే దగ్గుపాటి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23: గతంలో మాదిరిగా అవినీతికి పాల్పడినా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధికారులను హెచ్చరించారు. అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎమ్మెల్యే దగ్గుపాటి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వాలంటూ సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేయగా... వెంటనే కార్మికులకు చీపుర్లు, ఇతర పనిము ట్లు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గత ప్రభుత్వంలో మునిముట్ల కోసం డ్రా చేసిన రూ.1.60 కోట్లు ఎక్కడికి పోయాయని అధికారులను ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఖచ్చితంగా విచారణ జరుగుతుందన్నారు. ప్రస్తుత పాలక వర్గం, మేయర్, మాజీ ఎమ్మెల్యే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

వ్యవస్థలన్నిటినీ నాశనం చేసిన జగన్ : ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్ : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ వ్యవస్థలన్నిటినీ సర్వనాశనం చేశాడని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మండిపడ్డారు. స్థానిక సాయినగర్‌లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నడిమి వంక, మరువ వంక సైడ్ వాల్స్ అండర్ డ్రైనేజీ, డంపింగ్ యార్డుల పనులు ప్రారంభిస్తామన్నారు. నగర కమిషనర్ నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, నెట్టెం బాలకృష్ణ, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎం లక్ష్మీప్రసాద్, నారాయణస్వామి యాదవ్, సైపుద్దీన్, కడియాల కొండన్న, స్వప్న, పెండ్యాల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని రూరల్ పంచాయతీ పరిధిలోని భైరవ నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

నగరపాలక సెక్రటరీ బదిలీ

- టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కూడా ● నూతన ఎస్ఈగా భాస్కర్‌రావు
- ఇద్దరు ఈఈల బదిలీ... ఇద్దరి నియామకం

అనంతపురం క్రైం,సెప్టెంబరు 23 : నగరపాలక సెక్రటరీ సంఘం శ్రీనివాసులును హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండింటింగ్ ఇంజనీర్‌గా భాస్కర్‌రావును నియమించారు. విజయవాడ ఏపీఆర్‌ఏరా ఎస్ఈగా పనిచేస్తున్న ఆయనను నగరపాలక ఎస్ఈగా నియమించారు. నాగమోహన్ వెళ్లిపోయినప్పటి నుంచి ఎస్ఈ సీటు ఇన్‌చార్జ్‌లతోనే నడుస్తోంది. ఇక ఈఈలుగా విధులు నిర్వర్తిస్తున్న దంపతులు సూర్యనారాయణ, సుధారాణిని బదిలీ చేస్తూ... వారి స్థానాల్లో ఇద్దరు ఈఈలను నియమించారు. ఈఈ సూర్యనారాయణను విజయవాడ ఏపీ టిడ్కోకు బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో సెలవులో ఉన్న సి రాధాక్రిష్ణను నియమించారు. ఈఈ సుధారాణిని విజయవాడ ఏపీ టిడ్కోకు బదిలీ చేస్తూ ఆమె స్థానంలో కర్నూలు కార్పొరేషన్ ఈఈగా ఉన్న షాకీర్ హుస్సేన్‌ను నియమించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మారుతిహరప్రసాద్‌ను విజయవాడ టిడ్కోకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి కార్పొరేషన్‌లో ఏసీపీగా పనిచేస్తున్న పి శ్రీనివాసులును నియమించారు. కాగా గతంలోనూ ఇక్కడే ఏసీపీగా పనిచేయడం గమనార్హం. కర్నూలు కార్పొరేషన్ పనిచేస్తున్న మంజులను టౌన్‌ప్లానింగ్ టీపీఎస్‌గా నియమించారు. కాగా ఈమెను గతంలో ఇక్కడకు బదిలీ చేసినా నియమించుకోలేదు.

జిల్లా నీటి వనరులపై ప్రభుత్వం దాగుడుమూతలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 23: తుంగభద్ర, హంద్రీనీవా ప్రాజెక్టుల నుంచి జిల్లాకు పూర్తిస్థాయి నీటిని తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరు అందిందే విషయాల్లో నీటిపారుదలశాఖ మంత్రి జిల్లా పర్యటన సందర్భంగా స్పష్టంగా ఎందుకు ప్రకటించలేదన్నారు. తుంగభద్ర డ్యాం పొంగి పొర్లుతున్నా జిల్లాకు రావాల్సిన నీరు తెచ్చుకోలేని స్థితిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టడం లేదన్నారు.గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర తప్పులు చేసినందునే ప్రజలు తిరస్కరించారన్నారు. ఆ అనుభవాన్ని గుర్తించి ఇప్పటికైనా జిల్లా నీటి పారుదల అభివృద్ధికి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామన్నారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే ఆర్ఈఎఫ్ లక్ష్యం

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23 : నిబంధనల మేరకు ఉద్యోగుల హక్కులను పరిరక్షించడమే రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్ఈఎఫ్) లక్ష్యమని ప్రభుత్వ సర్వజనా సుపత్రి చిన్నపిల్లల విభాగం డాక్టర్ హేమలత పేర్కొన్నారు. ఉపాధ్యాయ భవన్‌లో ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులుగా విధుల నిర్వహణలో ప్రజలకు బాధ్యగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. అదే సమయంలో ఉద్యోగుల సంక్షేమాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు ఎండీ నాగభూషణం, నాయకులు రామకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవాలయ మాన్యం సమస్యపై...
స్థానికులతో ఎమ్మెల్యే దగ్గుపాటి చర్చలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23 : పాతూరు చెన్నకేశవ స్వామి మాన్యం భూముల సమస్యకు పరిష్కారం దిశగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం రాత్రి తహసీల్దార్ హరికుమార్, దేవాలయ శాఖాధికారి సుధారాణి, ఆలయ ధర్మకర్త వత్సలానంద, స్థానిక ప్రజలతో సమావేశమై సుదీర్ఘంగా చర్యలు జరిపారు. అనంతరం భూ సమస్య పరిష్కారం కోసం రెండు ప్రతిపాదనలు తెచ్చారు. ఆలయానికి భూమికి బదులుగా అనంతపురం నగరంలో మరో చోట అక్కడ నివాసముంటున్న ప్రజలకు స్థలం ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రతిపాదన చేయగా.. నగరంలో అంత మందికి ఒకే చోట అంత స్థలం కేటాయించడం కష్టమని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. అయితే ప్రస్తుతం నివాసముంటున్న వారు సెంటు స్థలానికి నిర్దేశించిన సొమ్మును దేవాదాయ శాఖకు చెల్లిస్తే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించేలా మరో ప్రతిపాదన తీసుకొచ్చారు. ఈ రెండు ప్రతిపాదనల్లో ఏదో ఒక నిర్ణయానికి రావాలని ఎమ్మెల్యే స్థానిక ప్రజలకు సూచించారు. ఈ విషయంలో ఇతరులు చెప్పే మాటలు నమ్మి ఎవరికీ డబ్బులు ఇవ్వరాదన్నారు. అనవసరంగా రాజకీయం చేసుకొని సమస్యను మరింత జఠిలం చేసుకోవద్దని ఎమ్మెల్యే సూచించారు.

ప్రధాని పాఠశాలలో శిక్షణ పొందిన విద్యార్థులు



వాడ్‌నగర్ పాఠశాలలో శిక్షణ పొందిన విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23 : ప్రధాని నరేంద్ర మోదీ ప్రాథమిక విద్య నభ్యసించిన పాఠశాలలో శిక్షణా తరగతులకు హాజరైన అనంత విద్యార్థులు శిక్షణ ముగించుకుని జిల్లాకు చేరుకున్నారు. వారిని సోమవారం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కాండేయులు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ స్థానిక కేంద్రీయ విద్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గుజరాత్‌లోని వాడ్‌నగర్ వెర్నాకులర్ పాఠశాలలో ప్రధాని మోదీ ప్రాథమిక విద్యనభించారని, అదే పాఠశాలలో ప్రేరణ-బోధనభ్యాసంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ నెల15నుంచి 21 వతేదీవరకు శిక్షణా తరగతులు నిర్వహించారన్నారు. దేశ వ్యాప్తంగా 20మంది విద్యార్థులు, పదిమంది ఉపాధ్యాయులను ఎంపికచేశారన్నారు. అందులో స్థానిక కేంద్రీయ విద్యాలయం నుంచి యశ్విత, గార్లదిన్నె ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఇమామ్ హుస్సేన్‌తోపాటు ఉపాధ్యాయురాలు మౌనిక పాల్గొని జిల్లా ఖ్యాతిని చాటారని తెలిపారు. శిక్షణ పొందిన అంశాలపై జిల్లాలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ కె కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బధిరుల వాలీబాల్, చెస్ క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23: జిల్లా బధిరుల క్రీడా పోటీలు ముగిశాయి. జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం సమీపంలోని ఆర్డీటీ బధిర పాఠశాలలో సోమవారం బధిర క్రీడాకారులకు వాలీబాల్, చెస్ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, సత్యనారాయణ రెడ్డి ప్రకటించారు. వాలీబాల్‌లో ఏ- గ్రూపు విజేతగా అజయ్‌కుమార్ నిలవగా, ద్వితీయ స్థానంలో సి - గ్రూపు నవీన్‌కుమార్, తృతీయ బహుమతి అభిలాష్ గెలుపొందారు. చెస్‌లో మొదటి స్థానంలో టిప్పుసుల్తాన్, రెండో స్థానంలో గౌతమి, మూడో స్థానంలో వీరప్రసాద్ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రఫీక్, ప్రిన్సిపాల్ ఎర్రిస్వామి, పీఈటీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బధిరుల వాలీబాల్ విజేతలు

యువత నైపుణ్యాలను పెంచుకోవాలి

- నెహ్రూ యువకేంద్రం అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23: యువత నైపుణ్యాలను పెంపొందించుకుని, దేశాభావృద్ధిలో భాగస్వాములు కావాలని నెహ్రూ యువ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మైభారత్‌లో భాగంగా ఎక్స్‌పర్‌మెంట్ లెర్నింగ్ ప్రోగ్రాం, యువతకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంచుకోవాలని, అప్పుడే పటిష్ఠ భారత స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. ప్రధాని మోదీ ఆశయాల సాధనలో భాగంగా మైభారత్ పోర్టల్‌లో యువతీ, యువకులందరూ తమ పేర్లను రిజి స్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత



శిక్షణలో నెహ్రూ యువకేంద్రం అధికారులు

బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గోవర్ధన్ శ్రీనివాసులు, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, చిన్ని కృష్ణ, సభ్యులు జయమారుతి, నాగేంద్రప్రసాద్, ప్రిసిల్లా, అలేఖ్య, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే ప్రజాసంక్షేమ పాలన

- ఎంపీ అంబికా, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, పాల్గొన్న ఎంపీ అంబికా

గార్లదిన్నె, సెప్టెంబరు 23 : ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎంపీతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నియోజకవర్గ టూమెన్ కమిటి సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల మన్నులను పొందుతున్నామన్నారు. వైసీపీ పాలనతో ఆర్థికంగా వెనుక బడిన రాష్ట్రం అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. జగన్ పాలనలో కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముంటి మడుగు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, సర్పంచు బచ్చలన్న, గేటుక్రిష్ణారెడ్డి, గుర్రం ఆదినారాయణ, ఎంపీటీసీ ధనుంజయ, నరసింహారెడ్డి, చితంబరప్ప, ఇల్లూరు రామాంజి, పుల్లన్న, వడ్డేవన్నూర్, సుంకన్న, చల్లానాగరాజు, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి: కలెక్టర్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి 510 అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ, అనుబంధ రంగాల 'పొలం పిలుస్తోంది' పోస్టర్లను, 'మీ విజన్ - మా మిషన్ కలిసికట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మిద్దాం' పోస్టర్లు ఆవిష్కరించారు. జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి



శింగనమలలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

శింగనమల, సెప్టెంబరు 23: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నరని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలపరిధిలోని శింగనమల, గుమ్మేపల్లిల్లో సోమవారం గ్రామ సచివాలయ అధికారులు, టీడీపీ నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగలకృష్ణమూర్తి, సర్పంచ్ లలితమ్మ, నాయకులు వెంకటేశ్, బోయ సత్తి, మాసూల చంద్ర, ఆదినారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మేపల్లిలో సోమవారం సర్పంచ్ డేగల లలితమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు.

నేడు లోలూరుకు ఎమ్మెల్యే రాక

శింగనమల : మండలపరిధిలోని లోలూరులో మంగళవారం నిర్వహించే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యాక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ సోమవారం తెలిపారు. కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవు తుందని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని అయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'దులీప్ ట్రోఫీ నిర్వహణ అభినందనీయం'



మాంచోఫెర్రర్‌ను సన్మానిస్తున్న ఎల్ఆర్‌జీ స్కూల్ పూర్వ విద్యార్థులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బీసీసీఐ దులీప్‌ట్రోఫీ నిర్వహణను కరవు జిల్లాలో విజయవంతం చేయడంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పాత్ర అభినందనీయమని ఎల్ఆర్‌జీ స్కూల్ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. దులీప్‌ట్రోఫీ విజయవంతం పట్ల ఎల్ఆర్‌జీ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సోమవారం స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో మాంచో ఫెర్రర్‌ను ఘనంగా సన్మానించారు. త్వరలో మహిళల అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించే అవకాశం వచ్చిందని స్నేహితులతో మాంచో ఫెర్రర్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఆర్‌జీ పూర్వ విద్యార్థులు వసుంధర, లలిత్‌కుమార్, రవిశంకర్, సునీత, రంజిత, లక్ష్మీప్రసాద్, హర్షద్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 23: విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలనే మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాపోటీలు ముగియడంతో సోమవారం చెన్నే కొత్తపల్లి ఉన్నతపాఠశాలలో విజేతలకు షీల్డ్, మెడల్స్ పంపిణీ కార్య క్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం ఓబుళమ్మ అధ్యక్షతన జరిగిన సమా వేశంలో క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి షీల్డ్, మెడల్స్‌ను అందజేశారు. కాగా టీడీపీ సీకేపల్లి పంచాయతీ అధ్యక్షుడు చెన్నకేశవుల గౌడ్ తన కుమా రుడు యశ్వంత్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా క్రీడాసామాగ్రి కోసం రూ.5 వేలు నగదును హెచ్‌ఎంకు అందజేశారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ హరి, టీడీపీ నాయకులు వడ్డేశ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు న ల్లప్ప, విజయ్‌నిర్మల, కుమార్‌రాజు, కుసుమ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.40 ఆర్థిక సాయం చేశారు. ఆమేరకు సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు పార్టీ కార్యాలయంలో ఆ చెక్‌ను అసోసియేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, వైస్ ప్రెసిండెంట్ మార్కు, కార్యదర్శి ఆనంద్, సహాయ కార్యదర్శి మనషే, కోశాధికారి జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కంబదూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


గొడిశలపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలవ, కలెక్టర్ వినోద్‌కుమార్


కత్రిమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తాం
- ఇది మంచి ప్రభుత్వంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కుందుర్పి/ కళ్యాణదుర్గం, సెప్టెంబరు 23: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని మలయనూరు గ్రామంలో సోమవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తి అయిందన్నారు. ఇంత తక్కువ కాలంలోనే సీఎం చంద్రబాబు అనేక పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యంగా పించన్ల పెంపు, ఉచిత ఇసుక పాలసీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, మెగా డీఎస్సీ విడుదల, అన్న క్యాంటీన్ల ప్రారంభం తదితర వాటిని చేపట్టి ఇది చేతల ప్రభుత్వంగా నిరూపణ చేశారని తెలిపారు. వచ్చే దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో బీటీపీ కాలువ పూర్తి చేసి ఇక్కడి రైతాంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రైతులకు సబ్సిడీ ఉలవలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. భూసార పరీక్ష ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. తొలుత కూటమి శ్రేణులు కుందిర్పి నుంచి మలయనూరు వరకు పెద్దత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనుంజయ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏడీ యల్లప్ప, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కంబదూరు మండలకేంద్రంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే అమిలినేని పాల్గొని మాట్లాడారు. తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కూడా వైఎస్ జగన్ అపవిత్రం చేశారని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకు గత వైసీపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. కళ్యాణదుర్గంలో నాటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ సంపదనంతా కొల్లగొట్టి కోట్లాదిరూపాయలు ఆర్జించారని విమర్శించారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. నాయకులు కరణం రామ్మోహన్ చౌదరి, అమిలినేని లక్ష్మీనారాయణ, చౌళం మల్లికార్జున, వెంకటేశులు, గాజుల శ్రీరాములు, తలారి ఎర్రిస్వామి, ఆవుల తిప్పేస్వామి, లింగా సురేంద్ర, టీడీపీ కన్వీనర్ శివన్న, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లూ విధ్వంస పాలన : ఎమ్మెల్యే కాలవ

డీ.హీరేహాళ్: గత ఐదేళ్లలో వైఎస్ జగన్ విధ్వంసకర పాలన సాగించి రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. మండలంలోని గొడిశలపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన ప్రజావేదికకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ, కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. వైఎస్ జగన్ అనాలోచిత నిర్ణయాలతో, కక్ష సాధింపు చర్యలతో అభివృద్ధిని విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో నడుస్తోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే సీఎం చంద్రబాబు పింఛన్లు పెంచారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశారని, మెగా డీఎస్సీని విడుదల చేశారని, ఉచిత ఇసుక పాలసీని తెచ్చారని, అన్నక్యాంటీన్లను ప్రారంభించారని తెలిపారు. మిగిలిన పథకాలను త్వరలోనే అమలు చేస్తారని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలలో ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామంలోని అంబేడ్కర్ కాలనీలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ప్రజావేదికలో ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన సామూహిక సీమంతంలో గర్భిణులకు చీరలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణిసుస్మిత, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ రఘునాథ్, జనసేన నేత మంజునాథ్‌గౌడ్, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామలక్ష్మి, ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున, ఆయా శాఖల అధికారులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి: మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని కత్రిమల గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే కత్రిమల-పెనకచెర్ల వంతెన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. పాళ్యం-కత్రిమల రోడ్డును త్వరితగతిన చేపడతామన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తనకు తెలపాలని, వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతిఇంటికీ మూడు ఉచిత సిలిండర్ల పథకం వచ్చే దీపావళి నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గోనపీరా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్న గారి కుమార్, నాయకులు ఆనంద్, సుదర్శన్, శ్రీరాములు, ఓబుళయ్య, మధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి, సెప్టెంబరు 23: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఢిల్లీశ్వరి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో గుత్తి మండలం కొత్తపేట-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఒక హెల్పర్, గుత్తిపట్టణంలో పద్మనాభయ్య ఫ్యాక్టరీ ఏరియాలో ఒక హెల్పర్, గుంతకల్లు పట్టణం అంకాలమ్మగుడి వీధిలో ఒక వర్కర్, అంకాలమ్మ గుడి వీధిలో ఒక హెల్పర్, మండలంలోని అమీన్‌పల్లిలో ఒక హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రకటన వెలువడిన తేదీనుంచి ఏడు రోజులలోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పొంది, పూర్తిచేసిన అనంతరం తిరిగి ప్రాజెక్టు కార్యాలయంలోనే సమర్పించి రసీదు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయక పోస్టుల కొరకు దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు వివాహితులై, స్థానికంగా నివాసం ఉండాలన్నారు. 1-7-2024నాటికి అభ్యర్థుల వయస్సు 21నుంచి 35 సంవత్సరాలు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

పుట్లూరు: మండలంలోని గోపరాజుపల్లి, పుట్లూరు, శనగలగూడూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ భారతి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు స్థానిక మహిళలకు అవకాశం ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉరవకొండ: ఉరవకొండ ప్రాజెక్టు పరిధిలో 12అంగన్ వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కూడేరు మండలం గొట్కూరులో మినీ అంగన్‌వాడీ పోస్టు(ఎస్‌సీ కేటగిరి) ఖాళీ ఉందన్నారు. అలాగే ఉరవకొండ-1(బీసీ-సీ), ఉరవకొండ-2 (బీసీ-ఈ), ఉరవకొండ-2 (బీసీ-ఏ), విడపనకల్లు మండలం గడేకల్లు-4(ఓసీ), హావళిగి(వీహెచ్), విడపనకల్లు-6(ఓసీ), పాలికి-3 (బీసీ-బీ), కూడేరు మండలం చోళసముద్రం-1(ఓసీ), కలగళ్లు-1 (ఎస్సీ), ఉదిరిపికొండ తండా(ఎస్టీ), బెళుగుప్ప మండలం యలగల వంక (బీసీ-డీ) ఆయా కేటగిరీలకు కేటాయించారన్నారు. అర్హులు దరఖాస్తులను అక్టోబరు 1వ తేదీ లోపల ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పల్లవి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని కసాపురం రోడ్డులో గల పల్లవి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పల్లవి స్కూల్‌లో చదువుతున్న 6,7వతరగతి విద్యార్థులు అక్ష, రాజ్‌కుమార్‌ను టీసీలు ఇచ్చి బయటకు పంపారు. దీంతో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నించినందుకు వారి విద్యార్థులకు యాజమాన్యం టీసీలు ఇచ్చి బయటకు పంపారన్నారు. ఇది ఎంతో దారుణమన్నారు. ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ రమేష్, పట్టణ కార్యదర్శి వెంకి నాయకులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలను పరిష్కరించాలి

యాడికి, సెప్టెంబరు 23: చేనేతల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు రుషింగప్ప, నారాయణస్వామి డిమాండ్ చేశారు. చేనేతల పరిష్కారం కోరుతూ సోమవారం యాడికిలో జాతీయ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో వారు నిరసన ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జాతీయ చేనేత ఐక్యవేదిక మండల కన్వీనర్ కోదండరామ్, నాయకులు హాజీపీరా , కుళ్లాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ధర్నా

బెళుగుప్ప, సెప్టెంబరు 23: మండలకేంద్రంలోని వైసీపీ నాయకుడు, రేషన్‌దుకాణం-2 మాజీ డీలర్ కరుణాకర్ స్వార్థానికి మేము బలి అయ్యామని, న్యాయం చేయాలని కోరుతూ వీఆర్‌ఏ హరి కుటుంబసభ్యులు ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దార్ ఎదుట ధర్నాకు దిగారు. పలువురు మాట్లాడుతూ కరుణాకర్ నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అధికారం ఉందని, అంతా నేను చూసుకుంటానని నమ్మబలికి వీఆర్‌ఏతో ఈ మిషన్లో లాగిన్ వేయించి పెద్దఎత్తున బియ్యం కాజేశారన్నారు. ఇలా ఐదేళ్ల నుంచి స్వాహా చేసినట్లు ఇటీవల జరుగుతున్న విచారణలో తేలుతున్నాయన్నారు. ఈ విషయమై కరుణాకర్ వద్దకు వెళ్లి అడిగామని, మీరు చెప్పడంతోనే ఈ మిషన్‌లో లాగిన్ వేశానని వీఆర్‌ఏ తెలిపాడని, ఇప్పుడు తన ఉద్యోగం పోయే పరిస్థితి నెలకొందని తెలపగా.. అతను తనకు ఎలాంటి సంబంధం లేదని దబాయించి దుర్భాషలాడారన్నారు. కరుణాకర్ చేసిన అక్రమాలకు మేము బలి కావాల్సి వస్తోందని , న్యాయం చేయాలని వీఆర్‌ఏ భార్య రాధమ్మ, బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. డీలర్-2పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ శివ, తహసీల్దారు కార్యాలయంకు చేరుకుని సమస్య తెలుసుకున్నారు. విచారిస్తామని ఎస్ఐ తెలపడంతో వారు శాంతించారు.

అధికారుల బదిలీలు

యల్లనూరు, సెప్టెంబరు 23: మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు సోమవారం బదిలీ ఉత్తర్వులు అందాయి. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్వేత పెద్దపప్పూరు మండలానికి బదిలీకాగా ఈ స్థానంలో పెద్దపప్పూరులో పనిచేస్తున్న మహబూబ్‌బాషాను నియమించారు. ఈఓఆర్‌డీ విజయశేఖర్‌నాయుడు తాడిమర్రికి బదిలీకాగా ఈ స్థానంలో పామిడిలో పనిచేస్తున్న శశికళను నియమించారు. మండల ఆర్‌ఐగా పనిచేస్తున్న హరిప్రసాద్ గుంతకల్లుకు బదిలీ అయ్యారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 23: రాయదుర్గం మండల తహసీల్దార్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు తహసీల్దార్‌గా ఉన్న నాగరాజు ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న ఫణికుమార్ కణేకల్లు మండలానికి వెళ్లారు.

కసాపురం ఆలయ ఈఓ బదిలీ

గుంతకల్లు, సెప్టెంబరు 23: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ ఈఓ భద్రాజీని అరసవెల్లి సూర్య దేవాలయానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలోకి కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం ఈఓగా ఉన్న కేవాణికి పోస్టింగ్ ఇచ్చారు. అలాగే కసాపురం దేవస్థానానికి ఇద్దరు ఏఈఓలకు పోస్టింగ్ ఇచ్చారు. మహానంది ఆలయంలో ఏఈఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, శ్రీశైలం ఆలయంలో ఏఈఓగా ఉన్న ఐఎన్‌టీ మోహన్‌ను కసాపురం దేవస్థానానికి బదిలీ చేశారు.

ఈఓఆర్‌డీగా జిలాన్‌బాషా

పుట్లూరు, సెప్టెంబరు 23: మండలంలో పలుశాఖల్లో అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. మండల ఈఓఆర్‌డీగా ఇక్కడ పనిచేసిన ఆనంద్ బదిలీపై రాప్తాడు వెళ్లగా తాడిపత్రిలో పనిచేసే జిలాన్‌బాషాను మండలానికి నియమించారు. హౌసింగ్ ఏఈగా సంధ్యారాణి పెద్దపప్పూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన లోకేష్ యాడికి మండలానికి బదిలీపై వెళ్లారు. వీరితోపాటు మండలంలో పనిచేసే వీఆర్వోలు ఐదుగురు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లగా మరో ఐదుగురు నూతన వీఆర్వోలు వచ్చారు.

ఉలవ విత్తనాల పంపిణీ

ఉరవకొండ, సెప్టెంబరు 23: వజ్రకరూరు మండలం ప్యాపిలీ ఆర్‌ఎస్‌కే లో సోమవారం సబ్సిడీపై రైతులకు ఉలవ విత్తనాలను పంపిణీ చేశారు. ఏఓ మధుకర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

గుంతకల్లుటౌన్/ గుంతకల్లు, సెప్టెంబరు23: రాష్ట్రంలో ప్రజారంజక పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్నారని పట్టణంలోని 20వ వార్డు టీడీపీ కౌన్సిలర్, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ఆర్ పవన్ కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక 20వ వార్డులో సోమవారం ఆయన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ అనిల్‌గౌడ్, రఘువీర్, పామిడి నజీర్, బబ్లు, కూటమి సభ్యులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ 25వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, ప్రధాన కార్యదర్శి గుజరి మహ్మద్ ఖాజా, కౌన్సిలర్లు వై సుధాకర్, అరుణ, టీడీపీ వాల్మీకి సాధికార సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్

పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లి, ఆమిద్యాల, రాయంపల్లి గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్లు రేగాటి నాగరాజు, మారెన్న, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండల కేంద్రంతో పాటు పెద్ద హోతూరు, గంజికుంట గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డీఆర్ఎం కార్యాలయంలో అవినీతిని అరికట్టాలి: సీపీఐ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 23: గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో అవినీతిని అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జూలైలో ఓ కాంట్రాక్టర్‌తో లంచం తీసుకున్నారని గుంతకల్లు డీఆర్ఎం, సీనియర్ డీఎఫ్ఎం, ఇతర అధికారులను సీబీఐ అధికారులు పట్టుకున్నారు. మరి రైల్వేశాఖ విజిలెన్స్, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏమి చేస్తున్నట్లు అని ఆయన ప్రశ్నించారు. డీఆర్ఎం కార్యాల యంలో ప్రతి కాంట్రాక్టర్ దగ్గర అధికారులు డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కాంట్రాక్టర్ చెయ్యి తడపనిదే పనులు జరగటంలేదన్నారు. ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీని నేరుగా నిర్మించడానికి అధికారులు సర్వే చేశారు. కాని కొంతమంది అధికారులు కాసులకు కక్కుర్తి పడి యూ షేపులో ఆర్‌యూబీ నిర్మించేందుకు టెండర్లను పిలిచారన్నారు. రైల్వే అధికారుల వద్ద నిధులు ఉంటే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు. గుంతకల్లులో రైల్వేకోచ్ వర్క్‌షాపు ఏర్పాటుకు అనువైన స్థలం ఉందని వెంటనే వర్క్‌షాపు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల సహాయ కార్యదర్శి రామాంజినేయుల యాదవ్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీష్

బఫర్‌తో సంబంధం లేకుండా బియ్యం ఇవ్వాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 23: కొత్తగా వచ్చిన స్టోర్ డీలర్లు బఫర్‌తో సంబంధం లేకుండా లబ్ధిదారులకు బియ్యం ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన డీలర్లు బఫర్ పేరుతో రేషన్ లబ్ధిదారులకు బియ్యం వేయడం లేదన్నారు. పట్టణం, గ్రామాలలో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బియ్యం, ఇతర సరుకులు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, జగ్గలిరమేష్, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా వ్యాపారి ఐపీ కలకలం

యాడికి, సెప్టెంబరు 23: మండలకేంద్రంలో ఒక కిరాణా వ్యాపారి ఐపీ పెట్టినట్లు కలకలం రేగింది. స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఒక కిరాణా వ్యాపారి హోల్‌సేల్ వ్యాపారుల నుంచి పెద్దమొత్తంలో సరుకులను అప్పుగా తీసుకోవడం డబ్బులు చెల్లించకపోవడం జరిగిందని పలువురు హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. అలాగే కొద్దిమంది చిట్టీల నిర్వాహకులకు పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉందని చర్చించుకుంటున్నారు. సోమవారం తెల్లవారుజామున సదరు కిరాణా వ్యాపారి ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోవడంతో అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు. కిరాణా వ్యాపారి తనపేరుతో ఉన్న ఇళ్లు, భూమి గుట్టుగా విక్రయించి సొమ్ము చేసుకొని వెళ్లిపోయినట్లు అప్పులు ఇచ్చిన వారు తెలిపారు. సుమారు 15మంది వ్యక్తులకు కోటి రూపాయలకు పైగా చెల్లించాల్సి ఉందని వ్యాపారులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వ్యాపారులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. సోమవారం రాత్రి కావడంతో మంగళవారం ఉదయం స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించినట్లు వ్యాపారులు తెలిపారు. కిరాణా వ్యాపారి ఐపీ పెట్టినట్లు సమాచారం యాడికిలో కలకలం రేపుతోంది.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడిపై హెచ్‌ఎంకు ఫిర్యాదు

గుంతకల్లు, సెప్టెంబరు 23: మండలంలోని పాతకొత్తచెరువు జడ్పీ హైస్కూల్లో ఓ విద్యార్థినిపై మధ్యాహ్న భోజన నిర్వాహకుడు చేయిచేసుకున్నాడు. దీంతో ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులు సోమవారం హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. గత శనివారం మధ్యాహ్న భోజనం సమయంలో ఆహారం సరిగా లేదని విద్యార్థిని చెప్పడంతో ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణమూర్తి ఆగ్రహానికి గురై విద్యార్థిని చెంపపై కొట్టాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు పాఠశాలకు వచ్చి ఇన్చార్జి హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు.

ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్‌లను ప్రకటించాలి

తాడిపత్రి, సెప్టెంబరు 23: గతేడాదికి సంబంధించి ఖరీఫ్, రబీ పంటలకు ఇన్సూరెన్స్ ప్రకటించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది వర్షాభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. పలు పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నెలలో పదహారుసార్లు మోటార్లు కాలిపోతాయా..?

- పంచాయతీ కార్యదర్శిపై ఎమ్మెల్యే ఆగ్రహం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 23: మండలంలోని మరిమాకులపల్లి పంచాయతీ పరిధిలో ఒక్క నెలలోనే పదహారుసార్లు పంచాయతీ మోటార్లు కాలిపోతాయా.. ఇదెక్కడి విడ్డూరం అంటూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంబదూరులో సోమవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. మీపై ఎంతోమంది ఫిర్యాదు చేశారని, ఇంత అవినీతికి పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఇప్పటికే మీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

కళ్యాణదుర్గం: కంబదూరులో సోమవారం ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు స్థానికుడైన ముతువల్లికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానిక మైనార్టీలు ముతువల్లికి ఇల్లు లేదని, సాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన వెంటనే రూ. 5 లక్షల నగదును అందించారు. అలాగే అండేపల్లిలో అల్లీపీరా ఆలయ నిర్మాణానికి రూ. లక్ష వితరణ చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

యల్లనూరు, సెప్టెంబరు 23: మండలంలోని వాసాపురం గ్రామానికి చెందిన సూరిపై సోమవారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. వాసాపురం ఎస్సీకాలనీలో ఓ మహిళ ఆదివారం ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో సూరి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని, సదరు మహిళ ఫిర్యాదు చేయడంతో సూరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు23: మండలంలోని పులిప్రొద్దుటూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది కంప చెట్లలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అందులో పేకాట ఆడుతున్న 10మందిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.1.50లక్షల నగదు, 2సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు, 52పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామకృష్ణుడు మాట్లాడారు. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. సమావేశంలో సీఐ శివ గంగాధర్‌రెడ్డి, ఎస్ఐ కాటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో హుండీల లెక్కింపు

బెళుగుప్ప, సెప్టెంబరు 23: మండలంలోని బూదిగుమ్మలో గల హనుమంతరాయ స్వామి, వెంకటరమణస్వామి ఆలయాల్లో గల హుండీల కానుకల్ని సోమవారం లెక్కించారు. హనుమంతరాయస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 51,713లు, వెంకట రమణ స్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 32,412లు ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి అక్కిరెడ్డి , అర్చకులు జ్ఞానేశ్వరస్వామి తెలిపారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

పాక్షికంగా కూలిన హాస్టల్ భవనం పైకప్పు

గుంతకల్లు, సెప్టెంబరు23: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలోని బీసీ హాస్టల్ భవనం పైకప్పు సోమవారం పాక్షికంగా కూలింది. హాస్టల్ భవనం పాతబడిపోవడంతో కొద్దిరోజులుగా పెచ్చులు రాలుతూ ఉన్నాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన శ్లాబ్ బయటివైపు పాక్షికంగా కూలిందని స్థానికులు తెలిపారు. పైకప్పు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడలేదు. ఈ భవనానికి వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 23: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఉద్దేహాళ్, నేమకల్లు గ్రామాలకు చెందిన లాలూసాబ్, బసప్పకు సంబంధించిన ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నాయని, తాము ఉదయం వాహనాలు తనిఖీ చేస్తూ వాటిని పట్టుకుని రికార్డులను పరిశీలించామని, ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

యాడికి, సెప్టెంబరు 23: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. సోమవారం యాడికి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. పోలీసు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేకాట, మట్కా, ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐ ఈరన్న పాల్గొన్నారు.

బేల్దారికి గాయాలు

తాడిపత్రి, సెప్టెంబరు 23: మండలంలోని తలారిచెరువు గ్రామంలో పెద్దన్న బేల్దారి పనులు చేస్తూ.. ప్రమాదవశాత్తూ జారిపడి గాయాలపాలయ్యాడని రూరల్ పోలీసులు తెలిపారు. ఊరుచింతల గ్రామానికి చెందిన పెద్దన్న బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనుల్లో భాగంగా సోమవారం తలారిచెరువు గ్రామానికి వెళ్లి ఇంటిపైన పనులు చేస్తుండగా అదుపుతప్పి కిందకు జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

గవిమఠం సహాయ కమిషనర్‌గా ఆదిశేషునాయుడు

ఉరవకొండ, సెప్టెంబరు23: ఉరవకొండ సహాయకమిషనర్‌గా ఆదిశేషునాయుడును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేస్తున్న సహాయకమిషనర్ చిత్తూరు జిల్లా ఏసీగా బదిలీ అయ్యారు.

ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 23: మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో టెక్స్‌టైల్స్ పార్కు వద్ద ఉన్న ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డీఎస్సీ అభ్యర్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద,మధ్యతరగతి అభ్యర్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో శిక్షణ పొందుతున్న ప్రతిఒక్కరూ ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం డీఎస్సీ అభ్యర్థులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. తర్వాత ఎమ్మెల్యే కోచింగ్ ట్రైనర్లు శివకుమార్, కోచింగ్ నిర్వాహకుడు ఇక్బాల్‌ను సత్కరించారు.